
సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 1 । మే । 2024



అన్ని వర్గాలకూ న్యాయం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాలకూ మేలు జరిగిందని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. 8లో ▸



వలసల జోరు

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరందుకున్నాయి. ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా వచ్చి చేరుతున్నారు. 10లో ▸



సబ్‌జైలు తనిఖీ

భీమవరం: భీమవరంలోని ప్రత్యేక ఉపకారాగాన్ని మంగళవారం రెండో అదనపు సివిల్ జడ్జి డి.ధనరాజు తనిఖీ చేశారు. ఖైదీలకు లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించారు.

న్యూస్‌రీల్

నిబద్ధతతో పనిచేయాలి



కలెక్టరేట్‌లో సమీక్షిస్తున్న దీపక్ మిశ్రా. చిత్రంలో కలెక్టర్, ఐజీ, ఎస్పీ

భీమవరం/భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా ఎన్నికల విధుల్లో పోలీసు సిబ్బంది నిబద్ధత, దేశభక్తితో పనిచేయాలని రాష్ట్ర ప్రత్యేక పోలీసు పరిశీలకుడు దీపక్ మిశ్రా అన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించేందుకు మంగళవారం ఆయన ఇక్కడకు వచ్చారు. భీమవరం కలెక్టరేట్‌లో ఎన్నికల ముందస్తు ఏర్పాట్లు, భద్రతా అంశాలపై సమీక్షించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత కీలకమని, ప్రతి ఓటరు స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం కల్పించే బాధ్యత పోలీసు శాఖదేనన్నారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ పర్యవేక్షణ బృందాల పనితీరు గురించి వివరించారు. జిల్లా ఎస్పీ వేజెండ్ల అజిత మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రధాన రహదారులు, ఓటర్ల వివరాలు, పోలింగ్ స్టేషన్స్, స్పెషల్ టీమ్స్, చెక్ పోస్టులు, నోడల్ ఆఫీసర్స్ నిర్వహిస్తున్న విధులు, మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ టీమ్స్ పనితీరు తదితరాలను వివరించారు. కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. రాష్ట్ర పోలీసు శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శంఖ బ్రతబాగ్చే, ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, జిల్లా స్పెషల్ జనరల్ ఎలక్షన్ పోలీస్ అబ్జర్వర్ శైలేష్ కుమార్ సిన్హా, ఏఎస్పీలు వి.భీమారావు, ఏటీవీ రవికుమార్ పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ పరిశీలన : కలెక్టరేట్ సముదాయంలోని జిల్లా ఎన్నికల నియంత్రణ (కంట్రోల్ రూమ్) కేంద్రాన్ని సందర్శించి పలు విభాగాలను ఆయన పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పరిశీలిస్తున్న పోలీస్ అబ్జర్వర్ శైలేష్‌కుమార్

భీమవరం: జిల్లా పోలీస్ అబ్జర్వర్ శైలేష్‌కుమార్ సిన్హా మంగళవారం భీమవరం నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. అక్కడ ఉన్న ప్రజలతో మాట్లాడి స్వేచ్ఛగా వారి ఓటు హక్కు వినియోగించుకోవడానికి సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులకు, ఎన్నికల విధుల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ఆయన వెంట సీఐ కాళీ చరణ్, భీమవరం టూటౌన్ సీఐ జి.శ్రీనివాస్, భీమవరం వన్‌టౌన్ సీఐ ఎ.శ్రీను ఉన్నారు.

ఎన్నికల కోడ్‌పై అవగాహన



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల ప్రక్రియ, నియమ నిబంధనలను, ఎన్నికల కోడ్‌పై అభ్యర్థులకు, వారి ప్రతినిధులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎం.దీప, ఎల్.నిర్మలరాజ్ పాల్గొని అభ్యర్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ అసెంబ్లీకి పోటీచేసే అభ్యర్థులు రూ.40 లక్షలు, పార్లమెంట్ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థులు రూ.95 లక్షలు వరకు ఖర్చు చేయవచ్చన్నారు. ఖర్చుల వివరాలు తప్పక సమర్పించాలన్నారు. రాజకీయ పార్టీల సమక్షంలో ఈవీఎంలను ర్యాండమైజేషన్ ద్వారా ఇప్పటికే నియోజకవర్గాలకు కేటాయించామని, మే 2న మరోసారి ర్యాండమైజేషన్ చేసి పోలింగ్ కేంద్రాల వారీగా కేటాయిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్, ఆబ్‌సెంటీ ఓటింగ్ ప్రక్రియలపై వివరించారు. ఈనెల 11న సాయంత్రం నుంచి నిబంధనలు మరింత కఠినంగా ఉంటాయన్నారు. ఎం.దీప ఆచంట, పాలకొల్లు, నరసాపురం, భీమవరం నియోజకవర్గాలకు ఎన్నికల సాధారణ పరిశీలకులుగా వ్యవహరిస్తున్నారని, 08816-299633, 9182408687 నంబర్లలో అందుబాటులో ఉంటారన్నారు. ఎల్.నిర్మలరాజ్ తణుకు, తాడేపల్లిగూడెం, ఉండి నియోజకవర్గాలకు ఎన్నికల సాధారణ పరిశీలకులుగా వ్యవహరిస్తారని, 08816-299631, 9182404268 నంబర్లలో అందుబాటులో ఉంటారన్నారు. ఎన్నికల పరిశీలకులు దీప, నిర్మలరాజ్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే, చట్ట ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఆక్వాకు అందలం

ఫిషరీస్ యూనివర్సిటీ

నిర్మాణ వ్యయం	రూ.332 కోట్లు
విస్తీర్ణం (సుమారు)	500 ఎకరాలు
తొలివిడత నిధుల మంజూరు	రూ.100 కోట్లు
పరిపాలన భవనం నిర్మాణానికి..	రూ.40 కోట్లు



లక్ష్మణేశ్వరంలో తాత్కాలిక భవనంలో ఏర్పాటైన ఫిషరీస్ విశ్వవిద్యాలయం



పాఠాలు వింటున్న మొదటి బ్యాచ్ విద్యార్థులు



ఫిషరీస్ యూనివర్సిటీ భవనం నమూనా

జాతీయ మత్స్య విశ్వవిద్యాలయం

- దేశంలో మూడో యూనివర్సిటీ ఏర్పాటు
- మొదటి బ్యాచ్ విద్యార్థులకు తరగతులు
- రూ.332 కోట్లతో నిర్మాణాలు
- ఆక్వా పరిశోధనలకు ఊతం

నరసాపురం: డాలర్ల పంట పండించే ఆక్వా ఉత్పత్తుల్లో రాష్ట్రవాటా సింహ భాగం. దేశానికి వేలాది కోట్ల విదేశీ మారకద్రవ్యం తెచ్చిపెట్టడంలో ఫిషరీస్, ఆక్వా ఉత్పత్తులది ప్రముఖ స్థానం. అటువంటి ఆక్వా, మత్స్య రంగాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఆక్వా సాగులో శాస్త్రీయ పద్ధతులను ప్రవేశపెట్టడంతో పాటు ఈ రంగంలో నిపుణుల కొరతను తీర్చేలా నరసాపురంలో జాతీయ మత్స్య విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంకల్పించారు. దేశంలో తమిళనాడు, కేరళలో మాత్రమే ఫిషరీస్ యూనివర్సిటీలు ఉండగా ఇది మూడోవది కానుంది. ఈ మేరకు ఇప్పటికే శంకుస్థాపన పూర్తికాగా నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 2023-24 విద్యా సంవత్సరం నుంచి తరగతులు కూడా ప్రారంభమయ్యాయి.

రూ.100 కోట్ల కేటాయింపు : 2022 నవంబర్ 21న సుమారు రూ.332 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఫిషరీష్ యూనివర్సిటీకి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. సుమారు 500 ఎకరాల స్థలంలో నిర్మాణాలకు తొలివిడతగా రూ.100 కోట్లు కేటాయించారు. ఇక పరిపాలనా భవన నిర్మాణానికి రూ.40 కోట్లను 2023 బడ్జెట్‌లో ప్రభుత్వం విడుదల చేసింది. సరిపల్లిలో యూనివర్సిటీ పరిపాలన, తరగతులు, హాస్టళ్ల భవనాలు, పీఎం లంక-బియ్యపుతిప్ప మధ్య ల్యాబ్‌లు, ఇతర భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

ప్రారంభమైన తరగతులు : 2023-24 విద్యా సంవత్సరంలో బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ కోర్సులు ప్రారంభించారు. తొలి ఏడాది 67 మంది విద్యార్థులు ప్రవేశం పొందగా లక్ష్మణేశ్వరంలోని తుపాను రక్షిత కేంద్రం తాత్కాలిక భవనంలో జాతీయ మత్స్య విశ్వవిద్యాలయం-మత్స్య కళాశాల (నరసాపురం) తరగతుల నిర్వహణ చేపట్టారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మాస్టర్ ఆఫ్ ఫిషరీష్ సైన్స్, పీహెచ్‌డీ కోర్సులు కూడా ఆరంభం కానున్నాయి. వర్సిటీ ప్రత్యేక అధికారిగా ఓగిరాల సుధాకర్ వ్యవహరిస్తున్నారు. 140 పోస్టుల నియామకం కూడా జరిగింది.

నిపుణుల కొరత తీర్చేలా.. ఆక్వారంగంలో నిపుణుల కొరతతో రాష్ట్రంలో ఏటా రూ.25 వేలకోట్ల అదనపు ఆదాయం కోల్పోతున్నట్టు అంచనా. ఈ వర్సిటీ ద్వారా నిపుణుల కొరత తీరి భవిష్యత్‌లో ఆక్వాలో శాస్త్రీయ సాగు పద్ధతులు అమల్లోకి రానున్నాయి. రాష్ట్రంలోని మత్స్య కళాశాలలు, మత్స్య పరిశోధనా కేంద్రాలను ఈ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకొచ్చారు.

ఆక్వా అభివృద్ధికి ఊతం



ఆక్వారంగ నిపుణులను తయారు చేసుకుని, సాగులో నైపుణ్యాలను పెంచుకుంటే నష్టాలు తగ్గుతాయి. రాష్ట్రంలో ఆక్వా, మత్స్యరంగాల అభివృద్ధికి ప్రభుత్వం పరితపిస్తోంది. దీనిలో భాగంగా బియ్యపుతిప్పలో హార్బర్ కూడా నిర్మిస్తున్నాం. ఆక్వా యూనివర్సిటీ తరగతులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

మెండుగా అవకాశాలు



ఫిషరీష్ కోర్సులు పూర్తిచేసిన వారికి ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయి. నాకు ఫిషరీస్ కోర్సులు అంటే ఆసక్తి. అయితే గతంలో ఈ కోర్సుల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు నరసాపురంలో యూనివర్సిటీ ప్రారంభించడంతో ఇక్కడే సీటు సాధించాను.

– ఎం.అలేఖ్య, బీఎఫ్ఎస్సీ, విద్యార్థి, గుంటూరు

ఆనందంగా ఉంది



రాష్ట్రంలో మొదటదిగా నరసాపురంలో ప్రారంభమైన మత్స్య విశ్వవిద్యాలయంలో మొదటి బ్యాచ్ విద్యార్థిగా చదువుకోవడం ఆనందంగా ఉంది. మా కోరిక తీర్చిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు. డిగ్రీ కోర్సు పూర్తయిన తర్వాత పీజీ కోర్సు కూడా నేను ఇక్కడే చేస్తాను.

– టి.హరిబాబు, బీఎఫ్ఎస్సీ, విద్యార్థి, నెల్లూరు

నేడు ఏలూరులో సీఎం జగన్ సభ

ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో మేమంతా సిద్ధం భారీ బహిరంగ సభ



ఏలూరు సీఆర్‌ఆర్ కాలేజీ గ్రౌండ్స్‌లో హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని

సాక్షి ప్రతినిధి, ఏలూరు: వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఏలూరులో పర్యటించనున్నారు. మేమంతా సిద్ధం పేరుతో పార్టీ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేసేందుకు బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. ఏలూరు జిల్లా కేంద్రంలో జరుగుతున్న మొదటి సభ కావడంతో పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం జగన్‌కు ఏలూరులో అపూర్వ స్వాగతం పలికేందుకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సీఆర్‌రెడ్డి కళాశాల ప్రాంగణంలోని హెలీప్యాడ్‌కు ముఖ్యమంత్రి చేరుకుంటారు. అక్కడ నుంచి 3.40 గంటలకు ఫైర్‌స్టేషన్ సెంటరులోని బహిరంగ సభ ప్రాంతానికి అశేష జనవాహిని నడుమ చేరుకుంటారు. సాయంత్రం 4.40 గంటలకు సమావేశం ముగించుకుని 5 గంటలకు హెలీప్యాడ్‌కు చేరుకుని తిరుగు ప్రయాణం అవుతారు. సీఎం షెడ్యూల్ ఖరారు కావడంతో పోలీస్ యంత్రాంగం భద్రతాపరమైన ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ క్రమంలో మంగళవారం ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, పార్టీ నేతలు, పోలీస్ అధికారులు హెలీప్యాడ్‌ను, భద్రతా పరమైన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఫైర్‌స్టేషన్ సెంటరులో జరిగే సభా ప్రాంతాన్ని పరిశీలించారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరానున్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా.. ఎమ్మెల్యే అభ్యర్థి ఆళ్ల నాని మాట్లాడుతూ సీఎం జగన్‌కు ఏలూరులో అపూర్వ స్వాగతం పలకడానికి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరానున్నారని, జిల్లా చరిత్రలోనే నిలిచిపోయేలా సభ జరుగుతుందన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగించేలా పార్టీ శ్రేణులు మరింత కష్టపడాలని సూచించారు. ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, రాష్ట్ర భూదాన్ కమిటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు ఉన్నారు.

విధిగా నియమావళి పాటించాలి

తాడేపల్లిగూడెం: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు విధిగా ఎన్నికల నియమావళిని పాటించాలని ఎన్నికల పరిశీలకుడు ఎల్.నిర్మలారాజ్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌ఓ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రెండో ర్యాండమైజేషన్‌కు సంబంధించి బుధవారం జెడ్పీ హైస్కూల్‌లో జరిగే సమావేశంలో తెలియజేస్తామన్నారు. ప్రచారంలో ఎన్నికల కమిషన్ నిబంధనలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాల గురించి వివరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, సీ విజిల్, సువిధ, ఈఎస్ఎంఎస్ వంటి అప్లికేషన్స్ గురించి తెలియచేశారు. సమస్యలుంటే జనరల్ పరిశీలకుడిని సెల్ 9840871259లో సంప్రదించవచ్చన్నారు. ఆర్వో కె.చెన్నయ్య, ఏఆర్వో బి.మురళీకృష్ణ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాటన్ విగ్రహానికి తొలగిన ముసుగు



తోకలపూడిలో కాటన్ విగ్రహానికి ముసుగు తొలగించిన దృశ్యం

సాక్షి స్పందన

భీమవరం: ఎన్నికల నిబంధనలంటూ కాటన్ దొర విగ్రహానికి వేసిన ముసుగు తొలగింది. వీరవాసరం మండలం తోకలపూడి పంచాయతీ కార్యాలయం వద్ద కాటన్ విగ్రహం ఉండగా.. ఎన్నికల కోడ్ పేరుతో అధికారులు ముసుగు వేశారు. దీనిపై 'సాక్షి'లో 'కాటన్ దొర విగ్రహానికి ముసుగు' పేరుతో కథనం ప్రచురించగా అధికారులు స్పందించారు. కాటన్ విగ్రహానికి ఉన్న ముసుగును తొలగించారు.

జగన్‌తోనే బీసీ వర్గాల అభివృద్ధి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



తణుకులో జరిగిన బీసీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య. చిత్రంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల

తణుకు అర్బన్: రాష్ట్రంలో బీసీలు అభివృద్ధి బాట పట్టారంటే అది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువేనని, బీసీలు బాగుండాలంటే మరలా జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోవాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ పోరాట యోధుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. చంద్రబాబు బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తే సీఎం జగన్ సొంత మనుషుల్లా చూశారన్న విషయం గమనించాలని కోరారు. తణుకు నెక్ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన తణుకు నియోజకవర్గ బీసీ వర్గాల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాధికారం విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించి ప్రతిపక్ష దొంగల మాయమాటలకు లొంగితే మరలా బీసీలు కింది స్థాయికి తొక్కివేయబడిపోతారన్నారు. బీసీల బతుకులు బావుండాలంటే జగన్ వెంట నడవాలని కోరారు. ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలను సైతం 50 శాతంపైగా బీసీలకు కేటాయించి బీసీల పక్షపాతిగా ఉన్న జగన్‌ను ముఖ్యమంత్రిగా చూడాలంటే బీసీ బిడ్డ, తణుకు ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరి వెంకట నాగేశ్వరరావును, బీసీల ఆడపడుచు, నరసాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

బీసీలకు అత్యంత ప్రాధాన్యం : చంద్రబాబు బీసీలను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా వాడుకుంటే.. సీఎం జగన్ బీసీలకు రాజ్యాధికారం అప్పగించారని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. బీసీ కాబట్టే తనకు మంత్రి పదవి వచ్చిందని, సామాన్య విద్యావేత్త గూడూరి ఉమాబాలను ఎంపీ అభ్యర్థినిగా అవకాశం ఇచ్చారని అన్నారు.

బీసీలకు పెద్దపీట : సీఎం జగన్ ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలను అత్యధికంగా బీసీలకు కేటాయించారని ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల అన్నారు. బీసీలంతా రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. బీసీలంతా ఐక్యంగా ఉంటూ సీఎం జగన్ నిలబెట్టిన బీసీ నాయకులను గెలిపించాలని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను మంత్రి కారుమూరి ఘనంగా సత్కరించారు. సభకు తణుకు నియోజకవర్గం నుంచి సుమారు 12 వేల మంది బీసీ వర్గాల వారు హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఎంబీసీ చైర్మన్ పెంద్ర వీరన్న, డీసీఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు మరిష్, రాష్ట్ర బీసీ సంఘం మహిళాధ్యక్షురాలు బేబీరాణి, నాడు వెంకటరమణ, మంత్రి కారుమూరి అల్లుడు దిలీప్‌కుమార్, వీరమల్లు ఫణీంద్రకుమార్, చోడే గోపి, బీసీ వర్గాలు, నాయకులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ఏపీలో అమలులో లేదు

- రాజకీయ దురుద్దేశంతో టీడీపీ ఫేక్ ప్రచారం
- ఎన్నికల అధికారి, కలెక్టర్లకు ఫిర్యాదు చేస్తాం
- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకులో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రాష్ట్రంలో అమలు చేయలేదని, అదంతా దుర్మార్గపు టీడీపీ కుట్ర రాజకీయమని రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైట్లింగ్ విధానాన్ని చంద్రబాబు తన దుర్మార్గపు పచ్చ సామాజిక మాధ్యమాల్లో జగన్ ప్రభుత్వం అమలుచేసినట్టుగా అసత్య ప్రచారం చేస్తున్నాడన్నారు. ఆ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని గతం నుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌పై ఒత్తిడి తీసుకువస్తున్నప్పటికీ మన రాష్ట్రంలో అమలుచేయబోమని అప్పుడే కేంద్రానికి వివరించినట్టు రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారన్నారు. అయినా జగన్ ప్రభుత్వంపై బురద జల్లాలనే ఉద్దేశంతో అసత్య ప్రచారాలకు టీడీపీ తెరతీసిందన్నారు. సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేక ఏదోక దుష్ప్రచారాన్ని వదిలి నాలుగు ఓట్లు వేయించుకోవాలనే దురుద్దేశంతో చంద్రబాబు అసత్య ప్రచారాన్ని తన ఐటీడీపీ ద్వారా ప్రసారం చేయిస్తున్నాడని విమర్శించారు. ఈ విధానాన్ని ప్రవేశపెట్టిన బీజేపీతోనే ఉన్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఈ విషయంపై మాట్లాడరే అని ప్రశ్నించారు. ప్రజలకు ఏదైనా మంచి చేయాలని నిత్యం సీఎం జగన్ ఆలోచిస్తారే కానీ వారికి హాని చేసే పనిని సహించరని స్పష్టం చేశారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అంశం న్యాయస్థానం పరిధిలో ఉందని, అసలు దానిపై మాట్లాడే అవకాశం కూడా ఎవరికీ లేదని చెప్పారు. ఈ బిల్లు పార్లమెంట్ ద్వారా రాజ్యసభకు రావాల్సి ఉంటుందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అక్కడ ఉన్న మెజార్టీతో అడ్డుకుంటామని ఈ సందర్భంగా మంత్రి కారుమూరి తెలిపారు. ఎవరికైనా అనుమానాలు ఉంటే మీ సమీపంలోని సబ్ రిజిస్ట్రార్‌లను సైతం సంప్రదించాలని, అది ఫేక్ న్యూస్ అని వారే చెబుతున్నారని స్పష్టం చేశారు.

అసత్య ప్రచారంపై ఫిర్యాదు చేస్తాం : ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై సామాజిక మాధ్యమాల్లో టీడీపీ కూటమి చేస్తున్న అసత్య ప్రచారంపై ఎన్నికల అధికారికి, కలెక్టర్లకు ఫిర్యాదు చేస్తున్నట్టు మంత్రి కారుమూరి చెప్పారు. తప్పుడు వార్తలు, తప్పుడు కథనాలు సృష్టించే పచ్చ సామాజిక మాధ్యమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరనున్నట్టు వివరించారు. తణుకు మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తన ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా ఈ అసత్య ప్రచారానికి తెరతీశాడని, మరో డమ్మీ నటుడు పృథ్వీరాజ్ ఏకంగా ఒక వీడియో తీసి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అమల్లోకి వచ్చేసినట్టుగా మినీ వీడియో చేయడాన్ని కూడా రాధాకృష్ణ తన ఫేస్‌బుక్ అకౌంట్‌లో ప్రసారం చేశాడని, దానిపై కూడా ఫిర్యాదు చేయనున్నామని చెప్పారు. ఈ సందర్భంగా న్యాయవాదులు బలిజేపల్లి రవిశంకర్, రెంటాల వెంకటేశ్వరరావు, అడ్డాల బాబ్జి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ విధానం అమల్లోకి రాలేదని, అదంతా ఫేక్ న్యూస్ అని వెల్లడించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు వి.సీతారాం, కర్రి గంగాధర అప్పారావు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని వర్గాలకూ న్యాయం

తాడేపల్లిగూడెం మండలంలో ప్రచారంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్ : మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశ పెట్టిన ఉచిత విద్యుత్ పథకం లేకుంటే పెత్తందారుల ఆస్తులు సైకిల్ ప్యాచీలు వేయించుకోవడానికి సరిపోయేవి కావని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఎద్దేవా చేశారు. మంగళవారం సాయంత్రం మండలంలోని నీలాద్రిపురం, కొమ్ముగూడెం, పట్టింపాలెం, వీరంపాలెం, బంగారుగూడెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఉచిత విద్యుత్ వల్ల భూముల విలువ పెరిగిందన్నారు. పెత్తందారుల ఆస్తులు వేల నుంచి కోట్లకు చేరాయన్నారు. పెత్తందారుల ఆస్తుల విలువ పెంచింది నాడు వైఎస్సార్, నేడు జగన్ అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలకు న్యాయం చేయాలనేది సీఎం జగన్ ధ్యేయమన్నారు. ఏడాది క్రితం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల్ని సోమరిపోతులను చేస్తున్నారని, చంద్రబాబు వస్తే పథకాలన్నీ రద్దు చేస్తామని చెప్పారన్నారు. నేడు మాట మార్చి తాము అధికారంలోకి వస్తే పథకాలు ఇస్తామని చెబుతున్నారని, ఈ విషయాలను ప్రజలు గుర్తించాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కట్ట కట్టుకుని సీఎం జగన్‌ను ఎదుర్కొంటున్నారన్నారు. సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ఇటీవల గులక రాయితో దాడి చేశారన్నారు. అయితే, పెత్తందారుల ఆట కట్టించాలంటే జగన్ ఉండాలని భగవంతుడు ఆకాంక్షించాడన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనతో పాటు ఎం.పీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను గెలిపించాలని ప్రజల్ని అభ్యర్థించారు. మాజీ ఎమ్మెల్యే యీలి నాని, అప్పుడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ నాయుడు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ పసల కనకసుందరరావు మాట్లాడారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, జెడ్పీటీసీ సభ్యులు ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పొనుకుమాటి శేషులత, వైస్ ఎంపీపీ సూర్నని రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు మార్లపూడి సుబ్బారావు, జంపెల్లి సత్యవతి, బుర్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్‌లు రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, కేతిరెడ్డి మాధవి, చుండ్రు తేజస్విని, ఎలిపే గాంధీ, మండల మహిళా అధ్యక్షురాలు నూనె రాధాకుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జద్దు హరిబాబు పాల్గొన్నారు.



నీలాద్రిపురం ప్రచారంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



22వ వార్డులో ఓ వృద్ధుడితో మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యం

అచ్చుగట్లపాలెంలో ప్రచారంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడాల గోపి



అచ్చుగట్లపాలెంలో గుడాల గోపి దంపతులకు హారతులిస్తున్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల ఆదరణతో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక 17వ వార్డు అచ్చుగట్లపాలెంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భార్య మంగతాయారుతో కలిసి గోపి ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా గుడాల గోపి మాట్లాడుతూ తాను నియోజకవర్గంలో అడుగుపెట్టింది మొదలు నాన్ లోకల్, డబ్బు పంచుతారు, వలస నాయకులు అంటూ నిమ్మల రామానాయుడు దుష్ప్రచారాలు చేస్తునారన్నారు. కాపు సామాజికవర్గం అంతా జనసేన వెనుకే ఉన్నారనేది కూటమి నాయకుల భ్రమ మాత్రమేనని అన్నారు. కాపుల ప్రాంతాల్లో తిరుగుతుంటే జగనన్న ప్రభుత్వంలో అనేక సంక్షేమ ఫలాలు అందుకుని ఎంతో లబ్ధిపొందామని, తమ ఓటు జగనన్నకేనని కాపు మహిళలు తనకు హామీ ఇస్తున్నారన్నారు. తనతో పాటు ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీటీడీ బోర్డు డైరెక్టర్ మేకా శేషుబాబు, యడ్ల తాతాజీ, రేలంగి నరసింహారావు, చినిమిల్లి గణపతిరావు, మండెల రజని, గజ్జరపు సురేష్, ముంగండ అన్నవరం, రేలంగి బాబి, చినిమిల్లి బాబి, రేలంగి సోంబాబు, కుంపట్ల చిన్నరాజా, కుంపట్ల పెద్దరాజా, మద్దా చంద్రకళ, మానుకొండ శ్రీనుబాబు, కోట రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ కోసం జగన్‌ను సీఎం చేసుకోవాలి

నరసాపురం 22వ వార్డులో ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి ముదునూరి

నరసాపురం: పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ నరసాపురం అభ్యర్థి, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రజలను కోరారు. మంగళవారం ముదునూరి పట్టణంలోని 22వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్ జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రతి కుటుంబానికి నవరత్నాల పథకంలో భాగంగా కలిగిన లబ్ధిని తెలియజేశారు. ముదునూరి మాట్లాడుతూ వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. నరసాపురం నియోజకవర్గంలో రాష్ట్రంలోనే ఎక్కువ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయన్నారు. తనకు ఎమ్మెల్యేగా మళ్లీ అవకాశం ఇవ్వాలని కోరారు. ఎంపీ, ఎమ్మెల్యే రెండు ఓట్లు ఫ్యాన్‌గుర్తుకు వేయాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కౌన్సిలర్లు వైకేఎస్, సోమరాజు దుర్గాభవానీ, బర్రి జయరాజు, మల్లాడి బుజ్జి, కావలి నాని, వల్లభూని శేఖర్, పతివాడ మార్కెండేయులు, కస్తూరి ఇందిరాదేవి, ద్వారా ప్రసాద్, అడిదల శరత్, గోరు సత్తిబాబు, జిల్లెళ్ల దిలీప్ పాల్గొన్నారు.

పరిశోధనా ప్రమాణాలు పెంచాలి

అకడమిక్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యానవర్సిటీ వీసీ జానకీరామ్



అకడమిక్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యాన వర్సిటీ వీసీ జానకీరామ్

తాడేపల్లిగూడెం: పీజీ విద్యార్థుల పరిశోధనా ప్రమాణాలను పెంచాలని ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీరామ్ అన్నారు. వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన వర్సిటీ పాలక భవనంలో మంగళవారం నిర్వహించిన వర్సిటీ 31వ అకడమిక్ కౌన్సిల్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. పరిశోధన పత్రాల నాణ్యత ప్రమాణాలను పెంపొందించడానికి, పరిశోధనా పత్రాల స్థాయిని మెరుగుపర్చడానికి యూజీసీ నిబంధనలు పాటించాలన్నారు. ఫుడ్ ప్రోసెసింగ్‌లో డిప్లమో కోర్సును ప్రవేశపెట్టినట్టు చెప్పారు. నంద్యాల జిల్లా డోన్‌లో కొత్త ఉద్యాన పాలిటెక్నిక్‌ను ఏర్పాటు చేయడానికి తీర్మానం చేశారు. ఎన్‌ఈపీ-2020లో భాగంగా ప్రొఫెసర్లకు డిగ్రీ విద్యార్థుల బోధనలో సహాయ పడటానికి పీహెచ్‌డీ విద్యార్థులను బోధన సహాయకులుగా నియమించడానికి మార్గదరకాలను వివరించారు. ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ వీసీ ఆర్.శారదా జయలక్ష్మీదేవి, డాక్టర్ వీణాగుప్త, రీతు జైన్, ఇతర అకడమిక్ సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెదవేగి: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కొప్పాకలో శానంపూడి శివ ఈనెల ఏప్రిల్ 28న కడుపునొప్పి భరించలేక పురుగుమందు తాగాడు. అతనిని ఏలూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

తణుకు అభివృద్ధిలో కారుమూరి ముద్ర

- తణుకు నియోజకవర్గంలో రూ. 3,200 కోట్లు సంక్షేమం, అభివృద్ధికి సూత్రధారి..
- జీనీ వ్యక్తిగా టీడీపీ కంచుకోటను ఛేదించి పేదలపక్షాన నిలిచిన వైనం
- సీఎం జగన్ స్ఫూర్తితో మాటిస్తే చేసే స్వభావం..
- మీ ఇంట్లో ఎమ్మెల్యే.. అందరివాడిగా నినాదం..
- సేవే లక్ష్యం.. సేవే మార్గంగా కారుమూరి సేవా సమితి..



తణుకులో పెరవలి రోడ్డు నుంచి తణుకు పట్టణంలోకి ప్రవేశించే మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐలవ్ తణుకు థీమ్ (ఫైల్)


తణుకు బ్యాంకు కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు (ఫైల్)


తణుకు హెడ్ పోస్టాఫీసు రోడ్డులో వేసిన సీసీ రోడ్డు


తణుకు హౌసింగ్ బోర్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసిన దృశ్యం

తణుకు అర్బన్: తణుకు నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి కారుమూరి ముద్ర స్పష్టంగా కనిపిస్తోంది. తణుకు ప్రాంతం వ్యాపార, వాణిజ్య పరంగా దిన దినాభివృద్ధి చెందడమే కాకుండా వివిధ కర్మాగారాల ఏర్పాటుతో పురోగతిలో దూసుకెళ్తుంది. జిల్లాలో తక్కువ సమయంలోనే ఆర్థికాభివృద్ధి సాధించిన తణుకులో విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. అత్యున్నత కార్పొరేట్ పాఠశాలలతోపాటు అత్యాధునిక వైద్యశాలలు తణుకులో వెలిశాయి. దీంతో తణుకులో రియల్ ఎస్టేట్ రంగం విస్తరించి నూతనంగా నివాసాలు ఏర్పరచుకునే పరిస్థితి అధికమైంది. జిల్లా నలుమూలల నుంచి తణుకులో స్థిరపడేందుకు రావడంతో తణుకు శివారు ప్రాంతాలు ఇళ్ల కట్టడాలు పెరిగి ఊరు పెరిగింది. దీంతో నిత్యం తణుకు ప్రాంతానికి చుట్టుపక్కల ఉన్న గ్రామాలతో పాటు దూర ప్రాంతాల నుంచి సైతం లక్షలాది మంది వివిధ పనులపై వస్తుంటారు. ఇందుకు కారణం 2009లో మహానేత వైఎస్సార్ కొలువులో ఎమ్మెల్యేగా గెలిచిన కారుమూరి తన మార్కు రాజకీయంతో తణుకు నియోజకవర్గం పురోగతి సాధించేందుకు పునాదులు వేశారు. ముఖ్యంగా వ్యాపార, వాణిజ్య రంగాన్ని ప్రోత్సహించేలా కార్యాచరణ చేసి విజయం సాధించారు.

సామాన్యుడైనా నేరుగా కలిసే సౌకర్యం..

తణుకులో టీడీపీ జమీందారీ వ్యవస్థ నుంచి అధికారం చేజిక్కించుకున్న మంత్రి కారుమూరి నేనెప్పుడూ మీ ఇంట్లో మనిషినే, అందరివాడిగానే ఉంటాననే నినాదంతో ప్రజల మనస్సు గెలిచారు. సామాన్య రైతు కుటుంబం నుంచి రాజకీయ నేతగా ఎదిగిన కారుమూరి 2022వ సంవత్సరం ఏప్రిల్ 10వ తేదీన తొలిసారి తణుకు ప్రాంతానికి మంత్రి స్థానాన్ని తీసుకువచ్చి రాష్ట్రంలో తణుకుకు గౌరవాన్ని తీసుకువచ్చారు. అయితే మొదటి నుంచి తన నివాసంలోను, పార్టీ కార్యాలయంలోను ఎవరి సిఫర్సులు లేకుండా సామాన్యులు సైతం నేరుగా తనను కలిసే పరిస్థితిని కలుగుచేశారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటికీ అదే విధానాన్ని కొన సాగించడంతో ఒక మంత్రిని ఇలా కూడా కలవవచ్చా అనే ఆలోచన సామాన్యుడికి కలిగింది.

అభివృద్ధిలో కీలకపాత్ర..

2009లో ఎమ్మెల్యేగా గెలిచిన రోజు నుంచి రాత్రి పగలు కష్టపడి ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి అవసరాలు, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేశారు. అంతే కాకుండా తణుకు నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేయాలో ప్రణాళిక సృష్టించి కార్యరూపం దాల్చేవరకు నిద్రపోలేదు. అంతేకాదు అప్పట్లో ఏ రోడ్డు చూసినా చిన్నపాటి వర్షానికే మునిగిపోయే దుస్థితి ఉండగా వరుసగా రోడ్లు, డ్రెయినేజీలు అభివృద్ధి చేసి ఆ సమస్యను తొలగింపచేశారు. అంతేకాకుండా వివిధ వర్గాలకు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలు చేసి మాజీ ఎమ్మెల్యేల పేర్లు పెట్టించిన ఘనత సాధించారు. తణుకు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో పచ్చదనానికి ప్రాధాన్యతనిచ్చి పార్కులు, ఊరు మొదట్లో స్వాగతం పలికే ముఖద్వారాల నిర్మాణాలు, ఇన్‌డోర్ క్రీడా ప్రాంగణాలు వంటి నిర్మాణాలతో అభివృద్ధిలో దూసుకెళ్లారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సహకారంతో తణుకు నియోజకవర్గానికి 2019 నుంచి సంక్షేమం, అభివృద్ధికి రూ. 3200 కోట్లు ఖర్చుచేశారు. ఇందులో భాగంగా వెయ్యి కోట్లు అభివృద్ధిలో భాగంగా అత్యధికంగా జగనన్న కాలనీల్లో విద్యుత్ దీపాల వెలుగుకు రూ.126 కోట్లు, విద్యుత్ రాయితీలు రూ. 129 కోట్లు, రూ. 36 కోట్లు అత్తిలి రోడ్డు నిర్మాణం వంటి భారీ ప్రాజెక్టులకు సైతం నిధులు తీసుకువచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలకు సంబంధించి తణుకు నియోజకవర్గంలో 162 కోట్లు నిధులు వెచ్చించి 350 ఎకరాలు కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణానికి కృషి చేశారు. ఢిల్లీలో మాత్రమే ఉన్న దండి మార్చ్ విగ్రహాలను తణుకులో ఏర్పాటు చేసి దేశమంతా తణుకువైపు చూసేలా చేశారు. వంగవీటి మోహనరంగా వీధిలో వైఎస్సార్ పార్కులో దేశ నాయకుల విగ్రహాలు, ఇటీవల తణుకు బ్యాంక్ కాలనీలో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రజల గుండెల్లో స్థానం సంపాదించారు. కారుమూరి సేవా సమితి ఏర్పాటుచేసి లక్షలాది రూపాయిలు సేవా కార్యక్రమాలకు ఖర్చు చేశారు. రాష్ట్రంలో మిగిలిన నియోజకవర్గాల కంటే అత్యధికంగా నిధులు తీసుకువచ్చి తణుకు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో మంత్రి కారుమూరి తనదైన శైలిలో వ్యవహరించి మంత్రి పదవి ఉన్నా సామాన్యుడిగా ప్రజల్లోనే ఉన్న మంత్రి కారుమూరి ప్రజాదరణకు కొదవలేదు.

క్లుప్తంగా

ఘనంగా శ్రీశ్రీ జయంతి

తణుకు టౌన్: పట్టణంలోని తెలుగు సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో శ్రీశ్రీజయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ రాసిన పలు కవితలను విద్యార్థులకు తాడినాడ భాస్కరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో రూట్స్ స్కూల్ డైరెక్టర్ విద్యా కాంత్ శ్రీశ్రీ రచనలు గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయలు ఏలూరిపాటి సుబ్బలక్ష్మీ, పెండ్యాల రామలక్ష్మీలను సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎం మోహనరావు, రెల్లి శ్రీనివాసరావు, భమిడి లక్ష్మణశర్మ, వీ జగదీశ్వరి, ఉత్కర్ష త్రిపాఠి, మోహనగాయిత్రీ తదితరులు పాల్గొన్నారు.

లారీ దగ్ధం


జువ్వలపాలెం రోడ్డులో దగ్ధమైన లారీ

తాడేపల్లిగూడెం అర్బన్: మండలంలోని బి.కొండేపాడులో బియ్యం లోడు దింపుకొని తాడేపల్లిగూడెం వస్తున్న లారీలో సాంకేతిక లోపాలు కారణంగా మంటలు చెలరేగాయి. మంగళవారం రాత్రి బి. కొండేపాడు నుంచి తాడేపల్లిగూడెం వస్తున్న ఐసర్ వ్యాన్‌లో బ్యాటరీ షార్టు సెర్క్యూడు కారణంగా మంటలుల చెలరేగినట్లు ఫైర్ ఆఫీసర్ జీవి.రామారావు తెలిపారు. మంటలను గమనించి డ్రైవరు వెంకటేశ్వరరావు లారీని ఆపి దూరంగా వెళ్లాడు. తాడేపల్లిగూడెం ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందజేయడంతో సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసినట్లు జీవీ రామారావు తెలిపారు.

విద్యుత్ స్తంభం నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను నుంచి కొత్తూరు కొత్త విద్యుత్ లైన్ వేస్తుండగా, సిమ్మెంట్ పోల్ నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఒక ప్రైవేట్ కార్మికుడికి మంగళవారం గాయాలయ్యాయి. దీంతో అతనిని తాడేపల్లిగూడెం పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించారు. పూర్తి వివరాలు తెలియవలసి ఉంది.

ఘనంగా ఆదికేశవస్వామి బ్రహ్మోత్సవాలు


అశ్వవాహనంపై ఊరేగుతున్న శ్రీఆదికేశవస్వామి

నరసాపురం రూరల్: ఆదికేశవ ఎంబేరుమనార్ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం పెద్ద అంబారీ ఉత్సవం నిర్వహించారు. అనంతరం పుష్ప కైంకర్యంతో తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి అశ్వ వాహనంపై స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి మాఢవీధుల్లో ఊరేగించారు. స్థానాచార్యులు కె.వెంకటాచార్యులు, పెద్దింటి మోహనరామాచార్యులు తదితరులు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.

విలువలు, విశ్వసనీయత లేని వ్యక్తి చంద్రబాబు

పాలకొల్లు అర్బన్: రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత లేని వ్యక్తి మాజీ సీఎం చంద్రబాబు నాయుడని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని మాలమహానాడు కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు సాధ్యం కాని హామీలతో ప్రజల ముందుకు వస్తారని, ఆ తరువాత వాటిని అమలు చేయరని చెప్పారు. ప్రస్తుతం అదే విధంగా 2024 మేనిఫెస్టోలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం అంటూ అనేక హామీలిచ్చారని, అవేవీ అమలు చేయడానికి సాధ్యం కాదని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌కి మించి సంక్షేమ పథకాలతో చంద్రబాబు మేనిఫెస్టో రూపొందించారన్నారు. వీటిని ప్రజలు ఎవరూ విశ్వసించడం లేదన్నారు. చంద్రబాబుకు ఓటేస్తే వలంటీర్ వ్యవస్థ పోయి జన్మభూమి కమిటీలు తెరపైకి వస్తాయని, ప్రజలను వారు లంచాల రూపంలో దండుకుంటారని మంగరాజు దుయ్యబట్టారు. రాష్ట్రంలో మరోసారి ఫ్యాన్ గాలి సునామీ రాబోతోందని మంగరాజు జోస్యం చెప్పారు. ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. రాష్ట్ర ప్రజలు సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా సీఎం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

ఆరుగురు వలంటీర్ల రాజీనామా

మొగల్తూరు: మొగల్తూరు గ్రామంలోని 1, 22 సచివాలయ పరిధిలో ఆరుగురు వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో వి.బాబ్జీరాజు మంగళవారం తెలిపారు. వ్యక్తిగత నిఘాతో వేధిస్తున్నారనే కారణంతో రాజీనామాలు చేస్తున్నట్లు వలంటీర్లు పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. మొగల్తూరు 1 సచివాలయ పరిధిలో ఐదుగురు, మొగల్తూరు-2 సచివాలయ పరిధిలో ఒక్కరు రాజీనామాలు చేశారని, దీంతో మండలంలోని 17 గ్రామాలకు సంబంధించి ఇప్పటి వరుకు 69 మంది వలంటీర్లు రాజానామాలు చేసినట్లు ఆయన చెప్పారు.

దోమలే సమాజానికి ప్రధాన శత్రువులు


పడాల గ్రామంలో దోమల నివారణ కరపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దోమలే సమాజానికి ప్రధాన శత్రువులని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. మంగళవారం మండలంలోని పడాల, ముత్యాలంబాపురం గ్రామాల్లో కీటక జనిత ప్రదేశాలను గుర్తించడం, కుటుంబ సర్వే కార్యక్రమాలను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమం ప్రతీ ఇంటి వద్ద జరగాలన్నారు. తద్వారా దోమలను నివారించవచ్చన్నారు. అనంతరం దోమల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. గ్రామ ఆరోగ్య కార్యదర్శి జ్యోతి, ఎంఎల్‌హెచ్‌పీ హనీ సుష్మ, ఆరోగ్య సహాయకులు కాంతారావు, రాధాకృష్ణ, ఆశా కార్యకర్తలు, పద్మ, నాగరత్నం, సత్యవతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొట్లాట ఘటనపై కేసు నమోదు

పెంటపాడు: ఆస్తికి సంబంధించి పాతగొడవలు పురస్కరించుకొని జరిగిన సంఘటనలో మహిళ ఫిర్యాదు మేరకు ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు గూడెం రూరల్ సీఐ రమేష్ తెలిపారు. పోలీసులు వివరాల ప్రకారం పరిమెళ్ల గ్రామానికి చెందిన యాతం యారియ్యకు, గంథం రమాపావనికి మధ్య గత కొంతకాలంగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 29న యారియ్య మరికొందరు రమాపావని ఇంటికి వెళ్లి జేసీబీతో ప్రహారీగోడ కూల్చివేయిస్తున్నారు. ఈ విషయంపై పావని వారిని ప్రశ్నించగా ఆమెను, ఆమె మావయ్యను కొట్టి, గాయపరిచారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

ప్రజా సంక్షేమమే మా లక్ష్యం


వెంకట్రాయపురంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్


అత్తిలిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మండల వైఎస్సార్ సీపీ నాయకులు

- ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్
- తణుకులో జోరుగా ఎన్నికల ప్రచారం

తణుకు టౌన్: రాష్ట్రంలో గత 58 నెలలుగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను ఇంటి గడప వద్దకే అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసేందుకు ప్రజలంతా ఓట్లేసి గెలిపించాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ కోరారు. మంగళవారం సాయంత్రం తణుకు వెంకట్రాయపురంలో ఆయన ఇంటింటికి తిరిగి వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయం కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్లగా వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను గడప వద్దకే అందజేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో సారి ముఖ్యమంత్రిని చేసేందుకు వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ముఖ్యమంతి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసేందుకు వీలైన హామీలను మాత్రమే ఇచ్చారని అదే టీడీపీ చంద్రబాబు నాయుడు ప్రజలను హామీలతో మోసం చేసేందుకు అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అటువంటి హామీలను నమ్మి గతంలో మాదిరిగా మరో సారి మోసపోవద్దని కోరారు. రాబోయే ఎన్నికలలో తణుకు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, నరసాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మంగెన సూర్య, పట్టణ కాపు సంఘం అధ్యక్షుడు వంటిద్దు ఈశ్వర ప్రసాద్, కాపు సంఘం నాయకులు, అడ్డాల రామకృష్ణ, షేక్ రోషన్ ఆలీ, వార్డు నాయకులు యల్లమిల్లి రమేష్, ఉమ్మడి సింగ్ శ్రీను, పేకేటి విజయలక్ష్మీ, తాతపూడి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూరులో...

సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తల ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మంగళవారం వేల్పూరు గ్రామ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గ్రామంలోని సాలిపేట శివాలయం వద్ద నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి జరగబోయే ఎన్నికలలో తణుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నున్న దుర్గాప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషుకుమారి, ఎంపీటీసీ సభ్యులు చుంద్రు శ్యామల, ఏఎంసీ డైరెక్టర్ బండి పార్వతి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తేతలిలో ఎస్సీ నాయకుల ప్రచారం...

రాబోయే ఎన్నికలలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ తణుక నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో తణుకు మండలం తేతలి గ్రామంలోని ఎస్సీ ఏరియాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తణుకు ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, మండల కోఆప్షన్ సభ్యుడు కె జస్పాల్, ఎస్సీ సెల్ నాయకులు, సిర్రా జాన్, దారం శ్రీను, నక్కా ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

అత్తిలి: వైఎస్సార్ సీపీ ఎన్నికల మేనిఫెస్టోలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను రూపొందించారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. మంగళవారం అత్తిలి ఆకులవీధి, మసీదురోడ్డు, శాసనాలవారి వీధిలలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను జగన్‌మోహన్‌రెడ్డి మాటతప్పకుండా అమలు చేసారని, భవిష్యత్‌లో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికలలో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా కారుమూరి నాగేశ్వరరావును, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల నాయకులు గారపాటి నాగరాజు, తమ్మాబత్తుల రాము, కంకటాల సతీష్, కోరుకొల్లు వెంకట్రావు, సబ్బితి రాజేష్, బుంగా పద్మారావు, ఆకుల చినబాబు, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, ధనుమూరి తాతాజీ, బుద్దరాతి దొరబాబు, దుడే ఉమ, పూడిమూడి ప్రసాద్, యడ్లపల్లి దుర్గారావు, దిరిశాల నాగబాబు, వీరవల్లి విఘ్నేష్, తీర్థాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ధాన్యం కొనుగోళ్ల జోరు


సీతారామపురం నార్త్ గ్రామంలో ధాన్యం మిల్లుకు తరలించేందుకు సిద్ధం చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: రైతు పండించిన పంట దిగుబడులను విక్రయించుకోవాలంటే గతంలో పడే ఇబ్బందులను తొలగిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు అన్నదాతలకు ఉపయోగకరంగా ఉన్నాయి. తమ దిగుబడులను గ్రామాల్లోనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా విక్రయించుకుంటున్నారు. రవాణా ఖర్చు మిగుతుండటం, మద్దతు ధర లభిస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నరసాపురం మండలంలో 15 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతు భరోసా కేంద్రాలు, సొసైటీల ద్వారా కొనుగోళ్లు ప్రారంభించారు. వరిలో ఏ గ్రేడు రకానికి రూ.2,203లు, కామన్ రకానికి రూ.2,183లు మద్దతు ధర ప్రకటించడం తో రైతులు కొనుగోలు కేంద్రాల్లో పంటలను అమ్ముకుంటున్నారు. ఇప్పటి వరకూ సుమారు 6 వేల టన్నులు కొనుగోలు చేశారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి

పెంటపాడు: సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కుమార్తె కాంచన్ శ్రీనివాస్, కోడలు కీర్తి విశాల్‌లు పేర్కొన్నారు. మంగళవారం పెంటపాడులో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ దాసరి హైమావతి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల నాగమణి, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళతో కలిసి ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజవర్గంలో శాంతి, భద్రతలు సక్రమంగా ఉండేందుకు మంత్రి కొట్టు సత్యనారాయణ ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నల్లమిల్లి అంజిరెడ్డి, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్ రెడ్డి, నల్లమిల్లి గాంధీరెడ్డి, బండారు నాగు, బస్సుల రెడ్డి, ఆడిటర్ దాసరి శ్రీనివాస్, శివారెడ్డి, పాలూరి సాయిరాం, యూత్ అధ్యక్షుడు కొవ్వూరి బాస్కరరెడ్డి, ఎస్సీ నాయకులు దేవాబత్తుల బాబి, ఏఎంసీ డైరెక్టర్లు సలుమూరి ప్రకాష్, కర్రి వరహాల రెడ్డి, కర్రి ప్రియాంకరెడ్డి చదలవాడ శ్రీనివాస్, బండారు రాంబాబు, ఉండ్రాజవరపు గోపి, రెడ్డి సంఘ సభ్యులు, నల్లమిల్లి అప్పిరెడ్డి, ఎస్సీ, బీసీ సంఘ నాయకులు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


పెంటపాడులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


విప్పర్రులో ప్రచారం చేస్తున్న కొట్టు విశాల్


కొట్టు సత్యనారాయణను గెలిపించాలని ప్రచారం చేస్తున్న కొట్టు తనయుడు బాలరాజేష్

33వ వార్డులో రాజేష్ ఇంటింటా ప్రచారం

తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్రంలో ప్రజలకు భరోసా ఇచ్చిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అని కొట్టు బాల రాజేష్ పేర్కొన్నారు.స్థానిక 27, 30 వార్డుల్లో మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తనయుడు కొట్టు బాల రాజేష్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షఫీ, జొన్నల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యం

పెంటపాడు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని వైఎస్సార్ సీపీ నాయకుడు వీర్ల గోవింద్ పేర్కొన్నారు. ప్రతిపాడులో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రచారం ఊపందుకుంది. ఈ సందర్భంగా ఎస్సీ ఏరియా, న్యూ జగనన్న కాలనీ, బీసీ ఏరియా, ఆరుగొలనురోడ్డు, కాగులంపాడు ప్రాంతాల్లో పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. జగనన్న చేపట్టిన నవరత్నాలు, ఆసరా, చేయూత, అమ్మఒడి, ఆరోగ్యసురక్ష, గోరుముద్ద, నాడు- నేడు, రీయింబర్స్‌మెంట్ తదితర పథకాలను గోవింద్ ప్రజలకు వివరించారు. యువత మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వీర్ల వెంకటేష్, దనరాజు, సైపు రెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విప్పర్రులో కొట్టు విశాల్:

మండలంలోని పడమరవిప్పర్రు గ్రామంలో యువనేత కొట్టు విశాల్ మంగళవారం ప్రచారం చేపట్టారు. వచ్చే ఎన్నికలలో తన తండ్రి కొట్టు సత్యనారాయణను మరో మారు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బోణం వీరయ్య, కోసూరి వెంకట్రాజు, మాజీ సర్పంచ్‌లు పసల చంటి, జోకల నాగేశ్వరరావు, , సొసైటీ అధ్యక్షుడు కళిరెడ్డి అబ్బాయి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మేకప్, ప్యాకప్‌లా పవన్ తీరు

అప్పుడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం



తాడేపల్లిగూడెం: జనసేన అధినేత పవన్ ఉంగుటూరు, గూడెం నియోజకవర్గాల్లో జరిగిన సమావేశాల్లో మాట్లాడిన తీరు చూస్తుంటే మేకప్, ప్యాకప్ మాదిరిగా ఉందని అప్పుడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం విమర్శించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గూడెం జనసేన అభ్యర్థిని పవన్ బాహుబలిగా అభివర్ణించారని, అంటే కూటమిలో కట్టప్ప ఉన్నట్టేనని, ఆ కట్టప్ప ఎవ్వరో చెప్పంటే బాగుండేదన్నారు. కాపు సామాజికవర్గంపై పవన్‌కు తీవ్రద్వేషం ఉందని ఆయన ప్రసంగాల్లో తెలుస్తుందన్నారు. ముద్రగడ కుటుంబాన్ని అవమానించిన విషయం పవన్‌కు తెలిసినా స్పందించలేదన్నారు. కాపు కులాన్ని చంద్రబాబు కాళ్ల దగ్గర తాకట్టు పెట్టిన పవన్‌ను ఏదైనా ప్రశ్నించాలి అంటే సిగ్గుగా ఉందన్నారు. ఎన్నికల్లో జనసేన 60, 70 సీట్లలో పోటీ చేస్తుందని అనుకుంటే చంద్రబాబు ఇచ్చిన 21 సీట్లకు పరిమితమై, వాటిలోని టీడీపీ నుంచి వచ్చిన వారికి పది సీట్లు ఇచ్చిన పవన్ కనీసం డిప్యూటీ సీఎం, మంత్రి అయ్యినా అవుతారా, లేదంటే పవన్‌ను రెండున్నరేళ్లపాటు సీఎంను చేస్తానని చంద్రబాబు చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. పవన్ కాపు కులాన్ని దయచేసి దిగజారిపోయేలా చేయవద్దన్నారు. అప్పుడా తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. ఈ నాలుగేళ్లలో రెండు సార్లు బెస్టు మెరైన్ అవార్డు పొందిన అవార్డు పొందిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. ఫీడ్‌రేటు రెండుసార్లు పెరిగితే తగ్గించే చర్యలు తీసుకున్నామన్నారు. కరెంటు యూనిట్ ధర ఐదు రూపాయలు చేశారంటూ పవన్ అసత్యాలు మాట్లాడుతున్నారన్నారు. దేశంలో మూడో ఆక్వా యూనివర్సిటీ నర్సాపురంలో సీఎం ఏర్పాటు చేస్తున్నారని, 14 ఏళ్ల సీఎంగా చేసిన చంద్రబాబుకు అప్పుడా తీసుకు రావాలన్న ఆలోచన ఎందుకు రాలేదన్నారు. 2014 నుంచి 2019 వరకు ప్రశ్నిస్తాను, గుడ్డలూడదీస్తాను అని చెప్పిన పవన్, రెండు పార్టీల వారి గుడ్డలు వేసుకుని తిరుగుతున్నారన్నారు. రాష్ట్రంలో ఆక్వా రంగానికి పెద్దపీట వేసిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

ఆటోమేటిక్ లాకింగ్ సిగ్నల్ సిస్టం ఏర్పాటు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని నిడదవోలు–కొవ్వూరు రైల్వే లైన్‌లో ఆటోమేటిక్ లాకింగ్ సిగ్నల్ సిస్టంను ఏర్పాటు చేసినట్లు విజయవాడ డివిజన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మండు రూప్‌కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిడదవోలు–కొవ్వూరు స్టేషన్‌ల మధ్య 14.82 కిలోమీటర్ల మేర రూ.21.83 కోట్లతో 9 నెలలలో ఈ ఆటోమేటిక్ లాకింగ్ సిగ్నల్ సిస్టం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజయవాడ–గన్నవరం, విజయవాడ–కృష్ణా కెనాల్ మధ్య కూడా ఈ సిస్టం ఏర్పాటు పనులు త్వరలోనే పూర్తి కానున్నాయన్నారు. గూడ్స్, ప్యాసింజర్ ట్రైన్‌ల రాకపోకలతో ఎప్పుడు రద్దీగా ఉండే ఈ రూట్‌లలో ఈ విధానం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. దీని ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

దెందులూరు: భార్య కాపురానికి రావడం లేదని ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దెందులూరుకు చెందిన పిట్టా తంబి (33), భార్యతో మనస్పర్థలతో పుట్టింటికి వెళ్లిపోయింది. మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

‘పశ్చిమ’లో పరుగులు తీస్తున్న హైవేల నిర్మాణం

కొత్తగా ఏర్పడ్డ పశ్చిమగోదావరి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధికి స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రంగంలోకి దిగి కేంద్రంపై ఒత్తిడి తేవడంతో గత రెండేళ్లలో భారీగా నిధులు మంజూరు అయ్యాయి. దీంతో నరసాపురం మీదుగా వెళ్లే 216 జాతీయ రహదారి పనులు పూర్తి కాగా, దిగమర్రు – ఆకివీడు 165వ జాతీయ రహదారిని నాలుగులైన్ల రోడ్డుగా అభివృద్ధి చేయడానికి ఏకంగా రూ.1000 కోట్లు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ కేటాయించింది. అటు కోనసీమ, ఇటు కోస్తా ప్రాంతాలను అనుసంధానం చేస్తూ రెండు భారీ హైవేల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇందులో గోదావరి జిల్లాలను కలుపుతూ నరసాపురం వశిష్ట గోదావరి వద్ద వంతెన నిర్మాణం కూడా చేపట్టనున్నారు. భీమవరం కేంద్రంగా ఏర్పడ్డ కొత్త జిల్లాలో ఇక నాలుగులైన్ల హైవేలు ప్రజల రవాణా అవసరాలు మెరుగుపడనున్నాయి.

- సీఎం వైఎస్ జగన్ చొరవతో పశ్చిమలో 2 హైవేల నిర్మాణం
- కేంద్రంపై ఒత్తిడి పెంచి.. నిధులు తెచ్చిన జగన్ సర్కారు
- రూ.2వేల కోట్లతో జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణాలు
- ఇప్పటికే పూర్తయిన చించినాడ–లోసరి గూట్లపాడు 216 హైవే పనులు
- దిగమర్రు – ఆకివీడు 165 హైవే నాలుగు లైన్లుగా శరవేగంగా అభివృద్ధి



నరసాపురం-ఒంగోలు 216 హైవేపై సీతారామపురం వద్ద ఏర్పాటు చేసిన టోల్‌గేట్

నరసాపురం: యలమంచిలి మండలం చించినాడ నుంచి, కృష్ణా జిల్లాలోని లోసరిగూట్లపాడు వరకు మధ్య ఉన్న 87 కిలోమీటర్ల మేర హైవే విస్తరణ చాలాకాలంగా పెండింగ్‌లో ఉంది. దీంతో నరసాపురం మీదుగా ఒంగోలుకు రవాణా మార్గం ఉన్నప్పటికీ, విస్తరణకు నోచుకోలేదు. దీంతో చించినాడ నుంచి లోసరి వరకు హైవే విస్తరించాలని ఒత్తిడి పెరిగింది. ఎట్టకేలకు 2013 నవంబర్‌లో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ విస్తరణ పనులకు ఉపక్రమించింది. 2014–19 మధ్య అధికారంలో ఉన్న టీడీపీ ఈ రోడ్డు పనుల పురోగతిపై దృష్టి పెట్టలేదు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పనుల పురోగతిపై కదలిక వచ్చింది. ముఖ్యంగా ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు జాతీయ రహదారుల అభివృద్ధి అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడటంతో పెండింగ్ నిధులు విడుదల చేయడం, పనులు పూర్తి చేయడం జరిగింది. మొత్తం రూ.1,100 కోట్లతో పనులు పూర్తయ్యాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ రోడ్డు నిర్మాణానికి రూ.490 కోట్ల నిధులు ఖర్చు చేయడం విశేషం.

రవాణా చరిత్రలో మైలురాయి

సింగిల్‌లైన్‌గా ఉన్న హైవేను 13 మీటర్ల మేర విస్తరించి డబుల్‌లైన్ చేశారు. నరసాపురం మీదుగా మచిలీపట్నం, ఒంగోలు, విజయవాడ వెళ్లడానికి దూరం తగ్గడమే కాకుండా, వ్యాపార, విద్య, వైద్య సదుపాయాల కోసం విజయవాడకు అక్కడి నుంచి ఇతర నగరాలకు వెళ్లడానికి ఉపయుక్తంగా మారింది. అధికారికంగా ప్రారంభ కాకపోయినా కూడా ఇప్పటికే ఈ రోడ్డులో ట్రాఫిక్ పెరిగింది. గోదావరి జిల్లాల్లో సగం ప్రాంతాల నుంచి మచిలీపట్టణం, విజయవాడ, ఒంగోలు వెళ్లడానికి ఇటువైపే ప్రయాణిస్తున్నారు. ఇక జిల్లాలో డెల్టా, తీరప్రాంతం నుంచి కొబ్బరి, మత్స్య ఎగుమతులకు అనువైన రవాణా సౌలభ్యం ఏర్పడింది.

ఎమ్మెల్యేలు పట్టుబట్టి.. ప్రయత్నించి..

ఉమ్మడి పశ్చిమలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యంగా నరసాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు హైవేల నిర్మాణ ఆవశ్యకతను ముఖ్యమంత్రికి వివరించడంతో సీఎం చొరవతో కదలిక వచ్చింది. వశిష్ట వంతెన నిర్మాణానికి దిండి నుంచి సీతారామపురం వరకూ 216కు బైపాస్ నిర్మించాలని, అలాగే దిగమర్రు, ఆకివీడు, అటు పామర్రు నుంచి ఆకివీడు 165వ జాతీయరహదారిని నాలుగు లైన్లుగా విస్తరించాలని కోరుతూ నేరుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర మంత్రి నితిన్‌గట్కరీకి లేఖ రాయగా, కేంద్రం స్పందించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

దిగమర్రు-ఆకివీడు రహదారికి రూ.1,000 కోట్లు

దిగమర్రు – ఆకివీడు 165వ జాతీయ రహదారిని నాలుగులైన్ల రోడ్డుగా అభివృద్ధి చేయడానికి ఏకంగా రూ.1,000 కోట్లు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ కేటాయించింది. పాలకొల్లు మండలం దిగమర్రు నుంచి కృష్ణా జిల్లా పామర్రు వరకూ ఉన్న 165వ జాతీయ రహదారిని ఈ నిధులతో నాలుగులైన్లుగా అభివృద్ధి చేస్తున్నారు. దిగమర్రు నుంచి ఆకివీడు వరకూ 40 కిలోమీటర్ల మేర రోడ్డు అందుబాటులోకి వస్తుంది. ఇప్పటికే అటు పామర్రు నుంచి ఆకివీడు వరకు నాలుగులైన్ల రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ఇటు దిగమర్రు నుంచి ఆకివీడు వరకు కూడా అనుసంధానంగా మిగిలిన భాగం పూర్తి చేయడానికి రూ.వెయ్యి కోట్లు కేటాయించడంతో పనులకు సంబంధించి ప్రాథమిక సర్వే పనులు పూర్తి చేశారు. దిగమర్రు జంక్షన్ నుంచి 216 జాతీయ రహదారి నరసాపురం, మొగల్తూరు మీదుగా ఒంగోలు కత్తిపూడి వెళతుతుంది. ఇప్పుడు పాలకొల్లు, భీమవరం, పామర్రు మీదుగా వెళుతున్న 165 జాతీయ రహదారిని రూ.వెయ్యికోట్లతో నాలుగులైన్లుగా అభివృద్ధి చేయడం ద్వారా కోస్తా ప్రాంతం నుంచి ఒంగోలు, విజయవాడ వెళ్లడానికి అటు భీమవరం, ఇటు నరసాపురం కోస్టల్ కారిడార్ నుంచి కూడా మెరుగైన ప్రయాణ సౌలభ్యం కలుగుతుంది.

కేంద్రంతో పోరాడి నిధులు తెచ్చాం



కొత్త జిల్లాలో హైవేల అభివృద్ధికి ఈ ఐదేళ్లలోనే ఎక్కువ నిధులు కేటాయించారు. గత ఏడాది ఒకేసారి రూ.1,490 కోట్లు కేటాయించడం రికార్డు. వశిష్ట వంతెన కూడా నిర్మాణమవుతుంది. జిల్లా కేంద్రం భీమవరం నుంచి కూడా విజయవాడకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుంది. పదేళ్లపాటు నత్తనడక నడిచిన 216 జాతీయ రహదారి అభివృద్ధి పనులు ఈ ఐదేళ్లలో వేగంగా జరిగి పూర్తయ్యాయి.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

వైఎస్సార్‌సీపీ వచ్చాకే పనుల వేగం పెరిగింది



216 హైవే నిర్మాణం 15 క్రితం ప్రారంభమైంది. పనులు చాలా నెమ్మదిగా సాగాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పనుల్లో వేగం పెరిగింది. ముఖ్యమంత్రి స్వయంగా కేంద్రంతో మాట్లాడటంతో నిధులు విడుదల కావడం, పనులు చురుగ్గా సాగాయి. పశ్చిమ డెల్టాలో ముఖ్యంగా ఆక్వా ఎగుమతులు కీలకం. హైవేల వల్ల రవాణా సౌలభ్యం పెరిగింది.

– చాగంటి సత్యనారాయణ, ఆక్వా ట్రేడర్

కేంద్రంతో కూడా పనులు చేయించారు



సీఎం వైఎస్ జగన్ చొరవ చూపి కేంద్రంతో మాట్లాడి వారితో నిధులు మంజూరు చేయించారు. 216 జాతీయ రహదారి పనులు పూర్తి చేయించారు. నరసాపురంలో ఫిషరీష్ యూనివర్సిటీ, హార్బర్ కడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఓవైపు అభివృద్ధి పనులు చేస్తూ, మరో వైపు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోంది. కేంద్రంతో మాట్లాడి జిల్లాలో అభివృద్ధి పనులు చేయించడం గొప్పవిషయం.

– తిర్రే బాబూరావు, రిటైర్డ్ మున్సిపల్ ఉద్యోగి

బలహీన వర్గాల పక్షపాతి వైఎస్ జగన్

- జగన్‌ను మళ్లీ సీఎం చేసేందుకు బీసీలు కృషి చేయాలి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు యాదవ్ పిలుపు



ఏలూరులో విలేకరుల సమావేశంలో అభివాదం చేస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): బలహీన వర్గాల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంకగళరావు యాదవ్ అన్నారు. సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షులు లక్కోజు రాజగోపాలాచారి ఆధ్వర్యంలో స్థానిక పవరుపేటలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2019 ముందు వరకు బీసీలను పెత్తందారీ పార్టీలు, పాలకులు ఒక విధమైన చులకనభావంతో చూసేవారని గుర్తు చేశారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక బీసీల జీవన విధానమే మారిపోయిందని, బీసీల అభివృద్ధి సంక్షేమంతో పాటు బీసీలకు రాజ్యాధికారం కల్పించేందుకు సీఎం జగన్ కంకణం కట్టుకుని మరీ పనిచేశారన్నారు. బీసీ సాధికారత దిశగా జగన్ ప్రభుత్వం పనిచేయడం గొప్ప విషయమన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా రాష్ట్రంలో బీసీలకు పెద్దపీట వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. మళ్లీ వైఎస్ జగన్ సీఎం అయితేనే బీసీలు మరింత రాణిస్తారన్నారు. ఈ విషయాలను గుర్తుపెట్టుకుని ప్రతి బీసీ వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లాలోని ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌తో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి బీసీలు కృషి చేయాలన్నారు. మరో ముఖ్య అతిథి, టీటీడీ పాలకమండలి సభ్యుడు నెరుసు నాగసత్యం మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా టీటీడీ పాలకమండలిలో నలుగురు బీసీలకు స్థానం కల్పించిన గొప్ప వ్యక్తి వైఎస్ జగన్ అని గుర్తు చేశారు. పాఠశాల స్థాయిలోనే సామాజిక విప్లవం తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఒకప్పుడు సంపన్నుల పిల్లలకే అందుబాటులో ఉండే ఇంగ్లిష్ మీడియం చదువులను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షులు లక్కోజు రాజగోపాలాచారి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎవ్వరూ ఇవ్వని ప్రాధాన్యతను బీసీలకు ఇచ్చిన ఏకైక వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. రాష్ట్రంలోని బీసీలకు 11 ఎంపీ, 41 అసెంబ్లీ సీట్లు, 16 ఎమ్మెల్సీలు, ఐదు రాజ్యసభ సీట్లు ఇచ్చి బీసీలపై తనకున్న ప్రేమాభిమానాలు చాటిన వ్యక్తి వైఎస్ జగన్ అని గుర్తు చేశారు. బీసీల పార్టీ వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి బీసీ కృషి చేయాలని కోరారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి ఆళ్ల నాని విజయానికై ప్రతి ఒక్క బీసీ ఒక సైనికునిలా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షులు గోనుగుంట్ల యలమందరావు వివిధ బీసీ సంఘాల నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, కిలాడి దుర్గారావు, చిదరబోయిన శ్రీనివాసరావు, కింజంగి రాజు, గుత్తుల బాలత్రిపుర సుందరి, షేక్ బాజీ, పరిటాల వీరాస్వామి, గొర్ల రామారావు, బాయి వెంకట్రావు, లావేటి రామాంజనేయులు, కిలారి బుజ్జి తదితర 15 బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నమ్మకానికి బ్రాండ్ అంబాసిడర్ సీఎం జగన్

ఏలూరు (టూటౌన్): నమ్మకానికి బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయితే, అబద్ధాలకు అడ్డాగా చంద్రబాబునాయుడు నిలుస్తున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ సమావేశం స్థానిక అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి అధ్యక్షతన మంగళవారం ఏలూరులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లాకా వెంగళరావు, టీటీడీ బోర్డు సభ్యుడు నెరుసు నాగ సత్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంగళరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని సంవత్సరాలకు బీసీలకు సమన్యాయం జరిగిందన్నారు. గత పాలకులు బీసీల పట్ల చిన్నచూపు చూస్తూ వారికి తాబేదారులుగా గుర్తింపునిచ్చారన్నారు. దానికి భిన్నంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి బీసీలకు రాజ్యాధికారం కల్పించే దిశగా కృషి చేయడం అభినందనీయమన్నారు. బీసీలంటే అణగారిన వర్గాల వారు కాదు బ్యాక్ బోన్ అనే విధంగా అన్నింటా అగ్రతాంబూలం ఇచ్చిన ఏకైక నేత సీఎం వైఎస్ జగన్ అని గుర్తుచేశారు. బీసీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు నామినేటెడ్ పదవులు, చట్ట సభల్లో ఎన్నడూ లేని గుర్తింపునిచ్చిన గొప్ప సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా బీసీలకు గుర్తింపు, ప్రాధాన్యతనిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని చెప్పారు. బీసీలకు పూర్తి స్థాయిలో రాజ్యాధికారం దక్కాలన్నా, అభివృద్ధి చెందాలన్నా తిరిగి వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టాలని, సీఎంగా మరోసారి వైఎస్ జగన్‌కు అవకాశం కల్పించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని బీసీలంతా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం కోసం కృషిచేయాల్సిందిగా పిలుపునిచ్చారు.



పీవీఎల్ సమక్షంలో పార్టీలో చేరిన గొరగనమూడి టీడీపీ, జనసేన కార్యకర్తలు



పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



విజయరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన రావికంపాడు టీడీపీ నేతలు



పార్టీలో చేరిన వల్లూరు టీడీపీ, జనసేన నేతలతో ఎమ్మెల్యే వాసుబాబు

వైఎస్సార్ సీపీలోకి వలసల జోరు

- టీడీపీ, జనసేన పార్టీలను వీడుతున్న నాయకులు
- వైఎస్ జగన్ ప్రభుత్వ సంక్షేమ పాలన మెచ్చి చేరికలు

కామవరపుకోట: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంటే దళితులంతా నడుస్తున్నారని చింతలపూడి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. మంగళవారం రావికంపాడులో 10 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీని వీడి కంభం విజయరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, జెడ్పీటీసీ కడిమి రమేష్, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్, జంగారెడ్డిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ కేసరి సరిత రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, చింతలపూడి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు గోరుముచ్చు గోపాల్ యాదవ్, దేవరపల్లి రామ్మోహన్‌రావు, బొప్పన చైతన్యకుమార్, గుర్రాల రవికుమార్, దాసి సుందర పాల్, కనుమూరు అంజిరెడ్డి, షేక్ మేరా సాహెబ్, కోటగిరి శ్రీకాంత్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

నూజివీడులో చేరిన టీడీపీ, ముద్దరబోయిన వర్గం నాయకులు

నూజివీడు: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లి మండలం సింహాద్రిఅప్పారావు పేటకు చెందిన ముద్దరబోయిన వెంకటేశ్వరరావు వర్గం నాయకుడు పిన్నిబోయిన రమేష్, పట్టణంలోని రామాయమ్మరావుపేటకు చెందిన టీడీపీ నాయకుడు వల్లెపు సత్యం ఎమ్మెల్యే మేకా ప్రతాప్ సమక్షంలో మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. పట్టణ అధ్యక్షులు శీలం రాము పాల్గొన్నారు.

పడమటిపాలెం నుంచి..

కలిదిండి: జగనన్న పరిపాలనలో జరిగిన అభివృద్ధి, అందుతున్న సంక్షేమం చూసి వైఎస్సార్ సీపీలో చేరికలు జోరుగా సాగుతున్నాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని పడమటిపాలెంలో 100 మంది తెలుగుదేశం, జనసేన పార్టీలను వీడి వైఎస్సార్ సీపీలో మంగళవారం చేరారు. వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుల ఆధ్వర్యంలో సుధాబత్తుల సుబ్బారావు, దూసనపూడి కాశీ, ఓదూరి సత్యనారాయణ, మిద్దె మాతారావు, వేగ్నేశ భోగేశ్వరరావు, కిట్టు వెంకన్న, పాము యేసు, శివ రాధాకృష్ణ, ఓదూరి రమేష్, పేరం రామస్వామి, పాము అశోక్ వారి కుటుంబాలతో 100 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే డీఎన్నార్ పార్టీ కండువా కప్పి సాదర స్వాగతం పలికారు. సర్పంచ్ సాన మీనా సరస్వతి, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వల్లూరు నుంచి..

గణపవరం: రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో సాగుతున్న సంక్షేమ, అభివృద్ధి పాలనకు ప్రజలంతా అండగా నిలవాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం వల్లూరు గ్రామానికి చెందిన పలువురు తెలుగుదేశం, జనసేన నాయకులు సొసైటీ అధ్యక్షుడు పుల్లేటి నాగరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారికి పార్టీ కండువాలు వేసి వాసుబాబు పార్టీలోకి ఆహ్వానించారు. గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, పార్టీ మండల కన్వీనర్ దండు రాము, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: పట్టణంతో పాటు నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు మండలాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, ఇచ్చిన మాట తప్పకుండా అమలు చేస్తుండటంతో దానికి ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. పట్టణంలోని 21వ వార్డులోని 20 కుటుంబాలు టీడీపీ నుంచి ఎమ్మెల్యే మేకా ప్రతాప్ తనయుడు మేకా వేణుగోపాల అప్పారావు (చంటినాయన) సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికి చంటినాయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అందరూ వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలన్నారు. నాయకులు కళ్లేపల్లి ఆదినారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు శీలం రాము, కలపాల కృపారావు, ప్రత్తిపాటి భుజంగరావు, కంచర్ల లవకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడుకు చెందిన 20మంది కార్యకర్తలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికి పార్టీ కండువాలు కప్పి చంటినాయన పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు యలవర్తి ప్రకాష్, ఎంపీటీసీ వనమా ఏసు, యలవర్తి కోటేశ్వరరావు, యలవర్తి భిక్షాలు, చింతపట్ల మాధవరావులు పాల్గొన్నారు. ముసునూరు మండలం గోపవరం నుంచి 20కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరాయి. వీరందరికి చంటినాయన వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడ్డేటి జీవరత్నం, పల్లెపాం రవి, గుడ్డేటి కాటయ్య, లాగు రవీంద్ర, తిరువీధుల సుధాకర్, జడ్పీటీసీ వరికూటి ప్రతాప్, కంచర్ల లవకుమార్ తదితరులు పాల్గొన్నారు. నూజివీడు మండలం పోలసానపల్లి నుంచి అచ్చి వెంకటేశ్వరరావు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పలగాని రంగారావు, ఎంపీటీసీ పలగాని వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

గొరగనమూడి నుంచి..

పాలకోడేరు: గొరగనమూడి గ్రామంలో మంగళవారం సర్పంచ్ గొట్టుముక్కల శివరామరాజు (శివాజీ రాజు), మాజీ సర్పంచ్ చెల్లబోయిన పాపారావు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నుంచి 50 మంది కార్యకర్తలు ఉండి నియోజకవర్గ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పీవీఎల్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ భూపతి రాజు చంటి రాజు, కటిక శ్రీదేవి, సర్పంచ్ గొట్టుముక్కల శివాజీ రాజు, మాజీ సర్పంచ్ చెల్లబోయిన పాపారావు, నాయకులు పిన్నమరాజు పృథ్వీరాజు, పంపన రామకృష్ణ, బళ్ళ పరమేశ్వరరావు, పొన్నమండ బాలకృష్ణ, బొక్కా ప్రసాదు, గోడి రవి, దిడ్ల రవి, పెన్మత్స శ్రీనివాసరాజు వీరవల్లి లక్ష్మణరావు, పాలా చిన్న, కుక్కల సాయి కృష్ణ ఉన్నారు.



ఎమ్మెల్యే ప్రతాప్ సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ, ముద్దరబోయిన వర్గం నాయకులు



చంటినాయన సమక్షంలో చేరిన వట్టిగుడిపాడు టీడీపీ కార్యకర్తలు



చంటినాయన సమక్షంలో చేరిన గోపవరం టీడీపీ కార్యకర్తలు



చంటినాయన సమక్షంలో పార్టీలో చేరిన అజ రయ్యపేట టీడీపీ కార్యకర్తలు